ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

బుధవారం 3 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:36 బుధవారం

సహర్ | 4:46 గురువారం

జిల్లాలో పోలీస్ యాక్ట్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 2 : జిల్లాలో ఏప్రిల్ చివరి వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

పంచాయతీల పన్ను వసూళ్లలో అగ్రస్థానం



- 98.3 శాతం లక్ష్యం సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జిల్లా
- వంద శాతం పూర్తి చేసేదిశగా ప్రయత్నాలు

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరైన పన్నుల వసూళ్లలో జగిత్యాల జిల్లా పంచాయతీ అధికా రులు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో 98.3 శాతం పన్ను వసూళ్లతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అదే సమ యంలో రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా, నారాయణ పేట జిల్లాలు సై తం 98 శాతం పూర్తి చేసి అగ్రస్థానంలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2023 -24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను వసూళ్లను ప్రత్యేకంగా నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు జిల్లాలో రూ. 12.51 కోట్లు వసూళ్లు జరిపి ఉన్నతాధికారులచే శభాష్ అనిపించుకుంటున్నారు.

జిల్లాలోని మేడిపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలు వంద శాతం పన్ను వసూళ్లను పూర్తి చేసి ముందంజలో ఉన్నాయి. గత యేడాది లక్ష్యంలో వందశాతం వసూలు చేశారు. ఈ ఏడాది సైతం వంద శాతం వసూలు అయ్యేలా సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లు జరపడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా లక్ష్యం ఇలా...

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 12.79 కోట్ల పన్ను వసూలు చేయాలన్న లక్ష్యం ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ. 12.51 కో ట్లు పన్ను వసూలు అయింది. ఇంకా జిల్లాలో రెండు శాతం పన్ను వసూలు చేయాల్సి ఉంది. పన్ను వసూలులో మేడిపల్లి మండలం 100 శాతం వసూలు చేసి అత్యధికంగా ఉండగా, బుగ్గారం, ఇబ్రహీంపట్నం మండలాలు 94 శాతం వసూలు చేసి అత్యల్పంగా ఉంది. సాధ్యమైనంత తొందరలో వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలన్న దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సిబ్బందికి దిశా నిర్దేశం...

రెండు, మూడు మాసాలుగా ఆస్తి పన్ను వసూళ్లను పంచాయతీ కార్యదర్శులు ముమ్మరం నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాలో 98.3 శాతం వసూలు చేశారు. వందశాతం వసూలు అయ్యేలా అధికారులు సిబ్బందికి దిశా నిర్ధేశం చేశారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులు కార్యాలయాల్లో పన్ను వసూలు చేయడంతో పాటు ఇంటింటికి తిరిగి వసూలు చేస్తున్నారు. జిల్లాలోని బీర్‌పూర్ మండలంలో 99 శాతం, ధర్మపురిలో 99, గొల్లపల్లిలో 98, ఇబ్రహీంపట్నం 94, మేడిపల్లి 100, జగిత్యాల 95, జగిత్యాల రూరల్ 98, కథలాపూర్ 97, కొడిమ్యాల 97, కోరుట్ల 98, మల్లాపూర్ 97, మల్యాల మండలంలో 98 శాతం వసూళ్లు అయ్యాయి. మెట్‌పల్లిలో 99, పెగడపల్లి 99, రాయికల్ 99, సారంగపూర్ 98, వెల్గటూరు మండలంలో 99 శాతం పన్ను వసూళ్లు అయ్యాయి.

మేడిపల్లి మండలంలో వంద శాతం పూర్తి..

జిల్లాలోని మేడిపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలు గత నెల 31వ తేదీ వరకు వంద శాతం పన్ను వసూళ్లు చేశాయి. మేడిపల్లి మండలంలో రూ. 70.15 లక్షల వసూలు చేయాలన్న లక్ష్యానికిగానూ రూ. 70.17 లక్షలు వసూలు చేసి అగ్రస్థానంలో నిలిచింది. లక్ష్యానికి మించి ఆస్తి పన్ను వసూలు చేసి మేడిపల్లి మండల పంచాయతీ అధికారులు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు.

ప్రత్యేక వెబ్ సైట్‌లో వివరాల నమోదు...

గ్రామ పంచాయతీల్లో 2017-18 నుంచి డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్‌ను ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ సైట్‌లో పొందుపర్చారు. ఆయా గ్రా మాల వారీగా ఆస్తి పన్ను వివరాలను ఈ వెబ్‌సైట్‌లో చేర్చారు. ఈ వెబ్‌సైట్‌లోని వివరాల ఆధారంగా డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్ (డీసీబీ) పత్రాలను ప్రింట్ తీసి ఈఓపీఆర్‌డీలు కార్యదర్శులకు అందజేస్తున్నారు. ఈ ఏడాదిలో కొత్తగా ఇళ్ల, ఫ్యాక్టరీల నిర్మాణాలు జరిగి ఉంటే వాటి కొలతలు తీసు కొని అదే విధంగా కొత్త దుకాణాల లైసెన్స్ ఫీజు వివరాలను రికార్డులలో పొందుపర్చి ఇస్తున్నారు. అయితే పన్ను వసూలు చేసిన రశీదుల ఆధారంగా వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన టీఎస్ ఈ-పంచాయతీల వెబ్‌లో నమోదు చేస్తున్నారు. దీని ద్వారా పన్ను వసూళ్ల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

అన్ని వర్గాల సహకారాలతోనే...

దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి, జగిత్యాల



జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచా యతీలలో వంద శాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ఇప్పటికే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతి నిధులు, ప్రజల సహకారాలతో 98 శాతం లక్ష్యం పూర్తి చేశాము. రానున్న కొద్ది రోజుల్లో వంద శాతం పూర్తి చేయడానికి నిర్ణయం తీసుకున్నాము.

పంచాయతీలకు రానున్న నిధులు...

గ్రామ పంచాయతీలు స్వయం పోషకాలుగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. పంచాయతీలకు ఇంటి పన్ను, తాగునీటి పన్నుతో పాటు వాణిజ్య దుకాణాలు, ఫ్యాక్టరీల నుంచి లైసెన్స్ ఫీజులు వసూలు చేస్తాయి. పంచాయతీల్లో పన్నులను గ్రామ కార్యదర్శులు వసూలు చేస్తారు. అయితే నిధుల కోసం పంచాయతీలు ఆరాట పడుతుంటాయి. ప్రభుత్వ పరంగా ఎస్ఎఫ్‌సీ, ఆర్థిక సంఘం నుంచి మాత్రమే నిధులు మంజూరవుతాయి. ఇది కూడా జనాభా ప్రతిపాదికన రూ. 2 లక్షల లోపు మాత్రమే ఆయా పంచాయతీలకు వస్తాయి. పలు అవసరాలకు పంచాయతీలకు పన్నుల రూపేణ వచ్చే సొమ్మే దిక్కు అవుతుంది. కేంద్రం కూడా వందశాతం పన్ను వసూలు అయితేనే ప్రత్యేకంగా గ్రాంట్లు ఇస్తామని చెప్పింది. ఇలాంటి పరిస్థితిలో జగిత్యాల జిల్లా పంచాయతీలు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే 98.3 శాతం లక్ష్యం పూర్తి చేసింది.

ఎండ దెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఇతరులు

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అపమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని మోతే వాడ తిప్పన్నపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు వైద్యాధికారులతో కలిసి ఎండ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితేనే తప్ప మధ్యాహ్నం బయటికి రావొద్దన్నారు. ఎండలో పనిచేసే కార్మికులు తరుచుగా నీటితో పాటు, ఓఆర్ఎస్ సేవించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా క్టర్ పుప్పాల శ్రీధర్, వైద్యులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారులపై కూరగాయలు విక్రయించొద్దు

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 2 : రహదారులపై కూరగాయలు విక్రయించవద్దని, కూరగాయల మార్కెట్‌లోనే క్రయ, విక్రయ దారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని టవర్ ప్రాంతంలో ఉన్న ప్రధాన కూరగాయల మార్కెట్‌ను మంగళ వారం పరిశీలించారు. వ్యాపారులు, రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్స్‌పెక్టర్ అశోక్ ఉన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీహరి అనే కార్మికుడిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న మానేరు విద్యార్థినులు

కొడిమ్యాల, ఏప్రిల్ 2 : మండలంలోని పూడూర్ గ్రామంలో గల మానేరు ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ సీబీఎస్ఈ స్టేట్ సెలబస్‌తో మానేరు విద్యా సంస్థలు నడుస్తున్నాయన్నారు. నలుగురు విద్యార్థులు ఆల్ ఇండియా సెమ్స్ పోటీ పరీక్షలో జాతీయ స్థాయిలో ర్యాంకులు పొందారన్నారు. మానేరు ఉత్సవ్-24 పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. విద్యా సంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలంపిక్స్ సంఘం ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, రాంరెడ్డి, రవీందర్ రెడ్డి, నాగ భూషణ్‌రెడ్డి, అయిలయ్య, రామస్వామి, లింగాగౌడ్, మల్లేశం, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ పట్నాలు



బోనాలతో వెళ్తున్న బోగ శ్రావణి

జగిత్యాలరూరల్ ఏప్రిల్ 2 : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ పట్నాలు, బోనాల జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బోనాల జాతర మహోత్సవ కార్యక్రమంలో జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీనాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఆస్తి పన్ను వసూళ్లలో జాప్యానికి కారకులపై చర్యలు తీసుకోవాలి'

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్‌లో ఆస్తి పన్ను వసూళ్లు ,చేయడంలో వెనుకంజ పడడానికి కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు శనివారం పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, 12, 46వ వార్డు కౌన్సిలర్లు నక్క జీవన్ కుమార్, ములస్తం లలితలు హైద్రాబాద్‌లోని సీడీఎంఏ ఫిర్యాదు పత్రాన్ని పోస్టు ద్వారా పంపి పత్రికలకు విడుదల చేశారు. ఈనెల 1వ తేదీన జగిత్యాల జిల్లా 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకంజ' అన్న శీర్షికన వచ్చిన కథనం క్లిప్పింగ్‌ను జతపరిచి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం తలపెట్టిన ఏ కార్యక్రమమునైనా పూర్తిగా సహాయ సహకారాలు అందించే తత్వం కలిగియున్న జగిత్యాల పట్టణ ప్రజలు ఆస్తి పన్ను చెల్లించకపోవడం జరగదన్నారు. సరియైన విధంగా ప్రచారం నిర్వహించకపోవడం, అవగాహన కల్పించకపోవడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఇంటి పన్ను వసూళ్ల విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహి స్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు

జర్నలిస్టుల సేవలు మరువలేనివి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి

రాయికల్, ఏప్రిల్ 2: జర్నలిస్టుల సేవలు మరువలే నివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. రాయికల్ పట్టణంలో బుధవారం ఇటీవల నూతనంగా ఏర్పాటైన ప్రెస్ క్లబ్ జేఏసీ సభ్యులను కలిసి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, పట్టణ ప్రధాన కార్యదర్శి కుంబోజు రవి, ఉపాధ్యక్షులు కునారపు భూమేష్, కడార్ల శ్రీనివాస్, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిరుపతి నాయక్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు తోపారపు ఆశన్న, తోవిటి లక్ష్మీనారాయణ, కుర్మ మల్లారెడ్డి, సామర్ల సతీష్, సింగని సతీష్, రవి, సుధాకర్, గోపి, సుమన్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కథలాపూర్, ఏప్రిల్ 2: మండలంలోని పెగ్గెర్ల శివారులోని వరద కాలువ పక్కన పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. పెగ్గెర్ల, కోనరావుపేట్, కథలాపూర్‌కు చెందిన ఏడుగురి వద్ద రూ. 20020 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జూదం, పేకాటలు ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా ఎస్సై సూచించారు.

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

బెడిసికొట్టిన ఎంపీపీ వర్గ వ్యూహం

మల్యాల, ఏప్రిల్ 2: ఎట్టకేలకు మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై ఎంపీటీసీల అవిశ్వాసం నెగ్గింది. దాదాపు మూడు నెలల ఉత్కంఠకు తెర పడింది. ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించిన ఎంపీటీసీ సభ్యుల వ్యూహాత్మక వైఖరితో ఎంపీపీ వర్గ వ్యూహం బెడిసికొట్టింది. దీంతో సభ్యుల అవిశ్వాసంతో విమల ఎంపీపీ పీఠం కోల్పోవాల్సి వచ్చింది. మల్యాల మండలంలో 14మంది ఎంపీటీసీలకు గాను ఒక్కరు విదేశాలకు వెళ్లగా పది మంది సభ్యులు ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్డీవోకు నోటీస్ అందజేశారు. తరువాత కోర్టు స్టేలతో వాయిదా పడుతూ వస్తున్న ప్రక్రియను మంగళవారం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన 9మంది ఎంపీటీసీలు పోతాని రవి, ఆగంతపు రవళి, ముదుగంటి వనిత, దొంగ అనిత, మారంపల్లి సరోజన, కొల్లూరి గంగాధర్, మరాఠి సంజన, సఫీయా వలీబేగం, క్యాతం పద్మ హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గడానికి 10 మంది సభ్యుల మద్దతు అవసరం అవుతుందనే వ్యూహంతో అవిశ్వాసం ప్రకటించిన శిబిరం నుంచి బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవిని ఎంపీపీ శిబిరానికి తీసుకెళ్లారు. 9మందితో అవిశ్వాసం వీగిపోతుందనే వారి వ్యూహం బెడిసికొట్టింది. 9మంది సభ్యుల మద్దతుతో అవిశ్వాసం నెగ్గింది. అవిశ్వాసం ప్రకటించిన కొందరు సభ్యులకు కూడా ఈ విషయం చివరి వరకు తెలియకపోవడం గమనార్హం. ఎవరూ ఊహించని ఈ పరిణామం మండలంలో చర్చణీయంశంగా మారింది. పది మంది సభ్యుల హాజరును మాత్రమే పట్టించుకున్న వారంతా ఈ సంఘటనతో విస్తుపోవాల్సి వచ్చింది.



మట్లాడుతున్న ఆర్డీవో



సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు

- **ఇన్‌చార్జి ఎంపీపీ కోసం నివేదిస్తాం: ఆర్డీవో**

ఎంపీపీ మిట్టపల్లి విమలపై సభ్యుల అవిశ్వాసం నెగ్గిందని జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్‌గౌడ్ ప్రకటించారు. సరిపడ కోరం ఉన్నందున సమావేశం నిర్వహించామని, ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసానికి 2/3 కోరం ఉండడం, 9మంది సభ్యులు మద్దతు తెలుపడంతో నిబంధనల మేరకు అవిశ్వాస తీర్మానం నెగ్గిందని తెలిపారు. త్వరలోనే ఇన్‌చార్జీ ఎంపీపీని నియమించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఇన్‌చార్జీ ఎంపీపీ నియామకం పూర్తయ్యాక ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ ఉండనుంది. ఈ సమావేశంలో ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్, మండల పరిషత్ సుపరిండెంట్ నాగరాజ్, ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆదాయం రూ 88,51,604

ధర్మపురి, ఏప్రిల్ 2: ధర్మపురి క్షేత్రంలో మార్చి నెల 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ 88,51,604 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్ల ద్వారా రూ 24,11,708, ప్రసాదాల ద్వారా రూ 25,73,270 లభించినట్లు పేర్కొన్నారు. అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ 8,02,230 ఉండగా హుండీ ద్వారా 30,64,396 ఆదాయం ఉన్నట్లు ఆయన వివరించారు. గత ఏడాది రూ 83,30,419 ఆదాయం రాగా ప్రస్తుతం రూ 5,21,185 అధికంగా వచ్చినట్లు తెలిపారు. ధర్మపురి రైస్‌మిల్లర్స్, ఆర్యవైశ్య, వర్తక సంఘం, భక్తులు, దాతలు, గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాల యజమానులు, ఇతర అధికారుల సహకారంతో 10 రోజుల్లో 50 వేల మంది భక్తులకు అన్నదానం చేసినట్లు ఆయన వివరించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగనీయకుండా ముందస్తుగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా ఆదేశాలు, సూచనల మేరకు వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్విఘ్నంగా నిర్వహించుటకు సహకరించిన ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, అనధి కారులు, పట్టణ ప్రజలకు దేవస్థానం పక్షాన పేరు పేరున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విజయవంతం కోసం సహకరించిన జిల్లా అదనపు కలెక్టర్ దివాకర, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎం హెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్, జగిత్యాల బస్ డిపో మేనేజర్ సునీత, ఇతర ఎస్ఐలు, అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, ఏప్రిల్ 2: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు అంజన్న సన్నిధిలో పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

- **అంజన్న దర్శించుకున్న ప్రభుత్వ విప్**

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. విప్ వెంట పలువురు కాంగ్రెస్ నా యకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎకరానికి రూ. 25 వేల నష్టపరిహారం అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్‌కు కోరుట్ల ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ వినతి

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండిన పంటలకు ఎకరానికి రూ. 25 వేల నష్టపరిహారం అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పర్శ రాంబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నీటి నిర్వహణ, విద్యుత్ వైఫల్యం వల్లనే పంట నష్టం జరుగుతుందని, వడగళ్లు, ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల నష్ట పరిహారం అందించాలని కోరారు. వంద రోజుల్లో చేస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశార. పంటలకు ఇస్తామన్న బోనస్ యాసంగి పంటలకు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీళ్లు తగ్గి రైతుల్లో కన్నీళ్లు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్‌రావు, మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

నగదు పట్టివేత

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2: వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. వట్టెంల గ్రామం వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా వేములవాడకు చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి సరైన ఆధారాలు లేకుండా లక్ష రూపాయలు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్టు వద్ద 93,500నగదును మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ఏఈ సుమన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఆర్ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కేడీసీసీబీకి రూ.100 కోట్ల లాభం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.100.10 కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించి గత ఏడాది రికార్డును బ్రేక్ చేసిందని బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎన్.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 91.40 కోట్ల స్థూల లాభం నమోదు కాగా ఈ యేడాది రూ.8.70 కోట్లు అదనంగా లాభం ఆర్జించడం జరిగిందని అన్నారు. బ్యాంకు నిర్థరక ఆస్తులు గత ఏడాది 0.97శాతం నుంచి ఈయేడు 0.75శాతానికి తగ్గిందని, 0.22శాతం తగ్గింపు గొప్ప విజయమని, ఇది బ్యాంకు పాలకవర్గం, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే సాధ్యమైందని చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అభినందించారు. డిపాజిట్లలో కూడా 246.28 కోట్ల వృద్ధితో గత ఏడాది ఉన్న 2282.62 కోట్ల నుంచి 2528.90 కోట్లకు పెరిగాయని అన్నారు. అడ్వాన్సులు కూడా 18.85శాతం వృద్ధితో రూ.3973.34 కోట్లకు పెరిగాయని, బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.876.24 కోట్లకు పెరిగిందని అన్నారు. మొత్తం వ్యాపారం 6501.24 కోట్లుగా నమోదైందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత మూడో అగ్రగామి బ్యాంకుగా కేడీసీసీబీ నిలవడం గర్వకారణమని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 42మంది రైతులు 614క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా కనిష్ఠ ధర రూ.6,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 2: శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.

అదనపు కట్నం కోసం వేధింపులు

● కొడుకుకి విషగుళికలు తినిపించి మహిళ ఆత్మహత్య

● కూతురు, మనుమడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆమె తల్లి బలవన్మరణం ● ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



రేయాన్ష్ (ఫైల్)



గాదె శ్రీజ(ఫైల్)



జయప్రద(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2: వరకట్న వేధింపులతో అత్తింటివారు కొట్టి పుట్టింటికి పంపించగా, ఈ గొడవలను భరించలేక తల్లిగారింటికి వచ్చిన ఓ గృహిణి పేగు తెంచుకొని పుట్టిన ఏడాది కూడా నిండని 11 నెలల కొడుకుకు విషగుళికలు ఇచ్చి అవే విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు, మనుమడి బలవన్మరణాన్ని చూసి తట్టుకోలేని తల్లికూడా అవే విషగుళికలు వేసుకొని తనువు చాలించిన విషాద ఘటన కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామపంచాయతీలోని విజయనగర్ కాలనీలో కలకలం రేపింది. 24 గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు, కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.

కరీంనగర్ శివారులోని బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీకి చెందిన పూసల జయప్రద, వెంకటేశ్వరచారిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు గద్దె శ్రీజ(27)కు వరంగల్‌కు చెందిన మొద్దుంపూర్ నరేష్‌తో 2021 నవంబరు 27న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షల వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు అత్తింటివారు ముట్టజెప్పారు. ఏడాది వరకు ఆ దంపతుల జీవనం సాఫీగా సాగింది. వారికి ఒక కొడుకు రేయాన్ష్ అలియాస్ అర్విన్(11 నెలల 25 రోజులు)ఉన్నాడు. నరేష్ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ వరంగల్ ఎల్లంబజారులో ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. అదనపు వరకట్నం విషయంలో ఇటీవల భార్యాభర్తలు శ్రీజ, నరేష్‌ల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మార్చి 29న భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు కలిసి శ్రీజను కొట్టి, వరకట్నం తీసుకురావాలని కొడుకుతో సహా పుట్టింటికి పంపించారు. అయితే మంగళవారం ఉదయం 6 గంటలకు శ్రీజ తన భర్త నరేష్‌కు ఫోన్ చేసి ఈ నెల 5న కొడుకు రేయాన్ష్ పుట్టినరోజు ఉందని, భర్తను రావాలని కోరగా తను రానని, మీరే చేసుకోండని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భర్తతోపాటు అత్త, మామలు దూషిస్తూ నీవు చచ్చిపో అంటూ మాట్లాడారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీజ ఉదయం ఏడు గంటలకు తన ఏడాది వయసున్న కొడుకు రేయాన్ష్‌కు విషగుళికలు మింగించి తాను కూడా మింగింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తుండగానే ఇంటి వద్దనే రేయాన్ష్ మృతి చెందాడు. శ్రీజ స్పృహ కోల్పోయి నోటి నుంచి నురుగులు వస్తుండగా ఆటోలో అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి ఆసుపత్రిలో చికిత్స చేస్తుండగా శ్రీజ మరణించింది. అక్కడే ఉన్న శ్రీజ తల్లి పూసాల జయప్రద(51) ఆధార్‌కార్డు తీసుకువస్తానని ఇంటికి వెళ్లి బెడ్‌పైన ఉన్న విషగుళికలు మింగింది. పక్కనే ఉన్న ఒక మహిళ వారించేసరికే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మరణించింది. పూసాల జయప్రద కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా ఆమె భర్త వెంకటేశ్వరాచారి మానకొండూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మృతులు శ్రీజ తండ్రి, జయప్రద భర్త వెంకటేశ్వరచారి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీజ తన కొడుకును హత్య చేసినట్లు కేసు నమోదుకాగా శ్రీజను భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు వరకట్నం కోసం వేధించినట్లు, వారి వేధింపుల కారణంగానే శ్రీజ, ఆమె తల్లి జయప్రద ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ ఎస్‌ఐ వెంకట్రాజం తెలిపారు.

● విష ప్రభావం కలిగిన టాబ్‌లెట్స్ ఎక్కడి నుంచి వచ్చాయనేది అంతుబట్టకుండా ఉంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి శ్రీజ తెప్పించుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శ్రీజ ఆసుపత్రిలో మరణించగానే ఆధార్‌కార్డు కోసం అని మరో మహిళతో ఇంటికి వెళ్లిన జయప్రద ఇంటిలో బెడ్‌పైన ఉన్న ఆ విషగుళిక ఒక్కటి నోటిలో వేసుకోగా అక్కడే ఉన్న మహిళ ఆ గుళికను బలవంతంగా తీసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఆ క్షణంలోనే జయప్రద స్పృహకోల్పోయిందని బంధువులు తెలిపారు. ఆత్మహత్యకు నిర్ణయించుకునే సెనేడ్ అంతటి విషం కలిగిన గుళికలను శ్రీజ తెప్పిచ్చుకుని ఉంటుందని భావిస్తున్నారు.

● మరో మూడు రోజుల్లో రేయాన్ష్ పుట్టినరోజు ఉండగా అంతలోనే ఈ ఘటన జరుగడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఈ ఘటనను తలుచుకుని బంధువులతో పాటు గ్రామస్థులు కంటనీరు పెట్టారు. కొన్ని గంటల ముందు ఇంటిలో కూతురు, భార్య, మనుమడితో గడిపిన తండ్రి ఆ ముగ్గురు మరణంతో ఒంటరివాడయ్యాడు.

జలపతి తండాలో వివాహిత ఆత్మహత్య



శోభ (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2: చందుర్తి మండలం దేవుడి తండా గ్రామపంచాయతీ పరిధిలోని జలపతి తండాలో గుగులోతు శోభ(25) అనే మహిళ అదనపు వరకట్నం వేధింపులు తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జలపతి తండాకు చెందిన గుగులోతు జలం ధర్‌కు వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన శోభతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చి పెళ్లి జరిపించారు. వివాహం జరిగిన కొద్దిరోజులు వీరి కాపురం సాఫీగానే సాగింది. వీరికి నాలుగు సంవత్సరాల క్రితం కుమారుడు జన్మించాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య అదనపు వరకట్న వేధింపుల గొడవలు జరుగుతున్నాయి. కాగా సోమవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వరకట్న వేధింపులతో శోభ చనిపోయిందని మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో పంచనామా నిర్వహించి, డీఎస్పీ నాగేంద్రచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 2: జగిత్యాల అర్బన్ మండలం మోతె చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన రొడ్డ ఉమ మహేష్ (14) జగిత్యాల పట్టణ శివారులోని మోతె చెరువులోకి తన స్నేహితులతో కలిసి ఈతకొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

వీడనున్న విద్యార్థి మృతి మిస్టరీ

● వ్యవసాయ బావిలో మృతుడి తల లభ్యం ● పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపించిన పోలీసులు

తిమ్మాపూర్, ఏప్రిల్2: ఓ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఎనగంటి అభిలాష్ గత మార్చి 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27 రోజుల తరువాత మార్చి 27న తిమ్మాపూర్ గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభించింది. మృతదేహనికి తల లేకపోవడంతో విద్యార్థి అభిలాష్ ఆత్మహత్య చేసుకున్నడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థి కుటుంబ సభ్యులు కూడా విద్యార్థి అభిలాష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఎల్ఎండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు ఆరు రోజులుగా బావిలో ఉన్న నీటిని పెద్ద మోటర్లు, క్రేన్‌ల సహాయంతో, మనుషులను పెట్టి తీసేందుకు ప్రయత్నించగా మంగళవారం ఉదయం బావిలో తల భాగం(పుర్రె) లభించింది. సిఐ స్వామి, గన్నేరువరం ఎస్సై నరేష్ క్రేన్ సహాయంతో వ్యవసాయ బావిలోకి దిగి దానికి బయటకి తీయించారు. పుర్రెను హైదారాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించి డీఎన్ఏ పరీక్షతో పాటు గాయాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ చేపట్టనున్నారు. రిపోర్టుతో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని, నివేదిక వచ్చేందుకు సుమారు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సీఐ స్వామి తెలిపారు. బావిలో నీటిని తోడేందుకు కృషి చేసిన వారిని అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



అరుణ్(ఫైల్)

జ్యోతినగర్,ఏప్రిల్2: ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దూకి మంగళవారం ములుకుంట్ల అరుణ్(23) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్కలపల్లి గేట్ ప్రాంతానికి చెందిన అరుణ్ మృతదేహాన్ని ఎన్టీపీసీ పోలీసులు రిజర్వాయర్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్(45) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్ రోజువారీగా గొర్ల కాపరిగా ఉంటూ సోమవారం ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో ఇంటి ముందు పడుకోగా ఉదయం లేచి చూసేసరికి మంచం కిందపడి ఉన్నాడు. మృతుడి భార్య సుజాత గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు తలకు తీవ్రగాయమైందని మృతిచెందినట్లు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య దాడి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అఖిల్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని సింగాపూర్ గ్రామ శివా రులో మార్చి 30వ తేదీన హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇజ్జిగిరి అఖిల్ రోడ్డు ప్రమాదానికి గురికాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అఖిల్ స్థానికంగా ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతుండగా తన మిత్రులను కలిసేందుకు సింగాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కుక్కకాటుతో యువకుడి మృతి



అరుణ్ (ఫైల్)

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని ధర్మారంలో కుక్క కాటుకు మంకు అరుణ్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మంకు వినోద, శంకర్ దంపతులు నిజామాబాద్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు అరుణ్ ధర్మారం గ్రామంలో ఉంటున్న నానమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. రెండు నెలల క్రితం నిజామాబాద్ గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన క్రమంలో గ్రామంలో పలువురితో పాటు అరుణ్‌ను పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కుక్క కాటుకు వైద్యం చేయించుకున్నప్పటికీ 15 రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు.

గంజాయి రవాణా చేస్తున్న తొమ్మిది మంది అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్



పట్టుకున్న గంజాయితో పోలీసులు (ఫైల్)

● రెండు కిలోల గంజాయి స్వాధీనం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2: గంజాయి రవాణా చేస్తున్న రెండు ముఠాలను అరెస్ట్ చేసినట్టు గోదావరిఖని ఏసీపీ రమేష్ తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాక చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు జరుపుతున్న సమయంలో ఇద్దరు యువకులు గంజాయి తరలిస్తూ పట్టుబడినట్టు ఏసీపీ పేర్కొన్నారు. వారివద్ద కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పాలకుర్తి నుంచి గంజాయి తీసుకువచ్చి యైటింక్లయిన్‌కాలనీతో పాటు సమీప ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపారు. కమాన్‌పూర్‌పోలీస్‌స్టేషన్ పరిధి జూలపల్లి శివారులో గంజాయి తరలిస్తున్న ఏడుగురిని కమాన్‌పూర్ పోలీసులు పట్టుకుని, వారి వద్ద కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్, సీఐ-2 లింగమూర్తి, కమాన్‌పూర్ ఎస్సై చంద్రశేఖర్, టూటౌన్ ఎస్సైలు వెంకటేష్, సనత్‌కుమార్ పాల్గొన్నారు.

రాణాలో ఉంచిన గంజాయి మాయం

సారంగాపూర్ : పోలీసుల తనిఖీల్లో పట్టుకున్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఏకంగా ఠాణా నుంచి ఎత్తుకెళ్లిన ఘటన చర్చనీయాంశంగా మారింది. 2023 ఫిబ్రవరిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజస్థాన్‌కు చెందిన ఓ అంబులెన్స్‌లో 70 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు నలుగురు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో భద్రపరిచి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్వార్టర్ పక్కన పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం పోలీసులు అంబులెన్స్‌ను పరిశీలించగా అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి అందులోని గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు ఏఎస్పీ వినోద్ కుమార్, డీఎస్పీ రఘుచందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకంగా పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి మాయం కావడంతో ఎస్పీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది.

ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని పలు తండాల్లో కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి ఐదు లీటర్ల గుడుంబా, ఎనిమిది వందల లీటర్ల బెల్లం పానకమును ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి తండా, గోవిందరావుపేట తండాలో గుడుంబాను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకమును స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు సూపరింటెండెంట్ పంచాక్షరి, ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు సత్వరమే అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు బాండ్‌లు ఇవ్వాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పీఆర్టీయూ కృషిచేస్తుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, సంఘ నాయకులు శశిధర్‌శర్మ, తూముకుంట మోహన్‌రెడ్డి, మాన్వాడ శంకర్, సందీప్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వనపర్తి వెంకటేష్ ఉన్నారు.

ప్రజా అభిప్రాయం మేరకే మేనిఫెస్టో

● బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్



రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్న మేనిఫెస్టో కమిటీ సభ్యులు

భగత్‌నగర్, ఏప్రిల్ 2: ప్రజా అభిప్రాయం మేరకే భారతీయ జనతాపార్టీ మేనిఫెస్టో ఉంటుందని మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి త్వరలో బీజేపీ పక్షాన ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించి విడుదల చేస్తామన్నారు. రైతులు ఏం కోరుకుంటున్నారో అభిప్రాయాలను చెప్పాలన్నారు. సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

వేములవాడలో ఒకరి దారుణ హత్య

● మద్యం మత్తులో స్నేహితుడే కడతేర్చినట్లు అనుమానం



సిర్రం మహేశ్(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 2: మద్యం మత్తులో కిరాతకంగా బండరాయితో కొట్టి స్నేహితుడినే చంపిన సంఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సిర్రం మహేశ్ (46) రెండు సంవత్సరాలుగా వేములవాడలో కూలి పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. స్థానిక భగవంతరావునగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్న మహేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మరో వ్యక్తితో పరిచయం ఏర్పడడంతో ఇద్దరు కలిసి తరచూ మద్యం సేవించేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం సేవించిన తర్వాత ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో తోటి స్నేహితుడు రాయితో ముఖంపై బాదడంతో మహేష్ అక్కడికక్కడే చనిపోయాడు. సోమవారం ఉదయం ఇంటి అద్దె వసూలు కోసం వచ్చిన యజమాని శ్రీనివాస్ ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపు నెట్టగా తలుపు తెరుచుకుంది. ఇంట్లో మంచంపై ఎలాంటి చలనం లేకుండా పడి ఉన్న మహేష్‌ను చూసి తమకు సమాచారం అందించాడని పోలీసులు తెలిపారు. హత్య ఘటన సమాచారం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మద్యం సేవించిన అనంతరం మహేష్‌పై రాయితో దాడికి పాల్పడి హత్యకు కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కొండాపూర్‌లో విషాదం

ముస్తాబాద్: వేములవాడలో సోమవారం రాత్రి జరిగిన ఘటనలో కొండాపూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. తాగిన మత్తులో జరిగిన దాడిలో కొండాపూర్‌కు చెందిన సిర్రం మహేశ్ మృతి చెందాడని స్థానికులు తెలిపారు. కొంత కాలంగా వేములవాడలో కూలి పనిచేసుకుంటున్న మహేశ్ స్నేహితులతో జరిగిన గొడవలో మరణించాడని పేర్కొన్నారు. కనీసం ఇల్లు కూడా లేని సిర్రం మహేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ అనంతరం నేరుగా ఊళ్లో దహన సంస్కారాలకు తీసుకువెళ్లడం పలువురిని కలిచి వేసింది. మహేశ్‌కు భార్య సిర్రం పద్మ, ఇద్దరు పిల్లలున్నారు.

మాస్ట్రో పాఠశాలలో వీడ్కోలు హంగామా



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కథలాపూర్, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని మాస్ట్రో పాఠశాలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదేళ్లు ఒకే చోట కలిసి పంచుకున్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు నేర్పిన విద్య, సంస్కారాల గురించి గుర్తు చేసుకున్నారు. అనంతరం పలు జానపద, సినీ గేయాలపై నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ మాట్లాడుతూ బాగా చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, డైరెక్టర్లు ఆకుల రాజేందర్ ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి

ఏబీవీపీ నాయకుల డిమాండ్

మెట్‌పల్లి, ఏప్రిల్, 2: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల గురించి ఇబ్బందులకు గురి చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలోని సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరడం జరిగిందన్నారు. ఇటీవల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలోని కరస్పాండెంట్ ఫీజు తీసుకురావాలని క్లాస్ రూమ్ నుంచి బయటకు పంపించడం చాలా బాధకరమైన విషయమన్నారు. చిన్నారులను ఫీజుల కోసం ఇబ్బందులకు గురి చేసిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి అభి వెంకట్, సభ్యులు జావేద్, శ్రీవంశీ, సాయిరాం, రంజిత్, వరుణ్ పాల్గొన్నారు.

నేషనల్ ఒలంపియాడ్ టెస్ట్‌లో ప్రతిభ



రాయికల్, ఏప్రిల్ 2: ఢిల్లీ సంస్థ వారిచే నిర్వహించిన నేషనల్ లెవల్ ఎక్స్‌ప్లోరర్ ఒలంపియాడ్ టెస్ట్‌లో రాయికల్ కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 8వ తరగతి చదువుతున్న మిడిదొడ్డి ప్రణయ శ్రీ స్టేట్ లెవల్‌లో మొదటి ర్యాంక్ సాధించింది. అలాగే కె.వైశిక, ఖలీషా అఫ్రా, కె.శ్రీకృతి, జె.రుద్వేద్, ఎస్.అగస్త్య, అరిఫీన్‌లు రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌లు సాధించారు. వీరికి ఈ నెల 3న హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ చిరంజీవి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఉస్మానియా క్యాంపస్ డాక్టర్ కోదండరాం, డీఆర్‌డీవో సైంటిస్ట్ డాక్టర్ కిషోర్ నేతల చేతులమీదుగా బహుమతుల ప్రధానం ఉంటుందని తెలిపారు. వీరిని పాఠశాల డైరెక్టర్ జె.తిరుపతి రావు, ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమష్టిగా ఉంటే సమస్యల పరిష్కారం


డాక్టర్ సత్యనారాయణను సన్మానిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు

మెట్‌పల్లి, ఏప్రిల్, 2 : మెట్‌పల్లి డివిజన్‌లోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు సమష్టిగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేద్దామని తిరుమల నర్సింగ హోమ్ సీనియర్ డాక్టర్ రానావేణి సత్యనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సీనియర్ నాయకులు డాక్టర్ సత్యనారాయణను కలిసి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నందున సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ నాయకులు అందిస్తున్న సహకారాలు మరవలేవని వారిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గాజంగి రాజమల్లయ్య, అధ్యక్షుడు బండి శంకర్, పెంట లింబాద్రి, లక్ష్మీనర్సయ్య, జోగ నర్సయ్య, దాసరి గంగనర్సయ్య, ప్రభాకర్, కాషా గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2: వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో రఘువరన్ సూచించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నంలో బోర్ వెల్ పనులను, మిషన్ భగీరథ నీటిని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సాగు నీటి విడుదలపై రైతుల హర్షం

ముఖ్యమంత్రికి రైతులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు

బీర్‌పూర్, ఏప్రిల్ 2: పంట పొలాలకు ఐదు రోజుల పాటు సాగు నీటిని విడుదల చేయించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం బీర్‌పూర్ మండల రైతులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ టీ. జీవన్ రెడ్డి మండల రైతుల పంటలు చివరి దశలో ఉన్నాయని ఆ పొలాలకు ఐదు రోజుల పాటు సాగు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరగా వెంటనే స్పందించి ఎస్సారెస్పీ కాలువకు మంగళవారం నీటిని విడుదల చేయించారు. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ టీ. జీవన్‌రెడ్డిలకు ఎంపీపీ మసర్తి రమేష్, మండల నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతు రుణమాఫీ ప్రకటించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నేతలు

మేడిపల్లి, ఏప్రిల్ 2: రైతులు పడుతున్న గోసను చూసి వారికి రావాల్సిన రైతు బరోసా, రుణమాఫీ, పంట బోనస్ వెంటనే ప్రకటించాలని కోరుతూ భారతీయ జనతపార్టీ ఆధ్వర్యంలో తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేల రైతులకు ఇచ్చిన హమీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దశరథరెడ్డి, మంజశ్రీనివాస్‌గౌడ్, జగన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, హన్మడ్లు, మధు, ఇజ్రయిల్, శంకర్ పాల్గొన్నారు.

ప్రచార రథానికి స్వాగతం

కొడిమ్యాల, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయి నిపల్లి వినోద్‌కుమార్ ప్రచార రథం మంగళవారం మండల కేంద్రానికి రాగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్వామి, చంద్రమోహన్, లక్ష్మన్, చంద్రయ్య, మల్లారెడ్డి, మల్లేశం ఉన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి


సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ కోటపై బహుజన జెండా ఎగరవేసిన గెరిల్లా పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని గౌడ ప్రొఫెషనల్స్ అండ్ అఫిషియల్స్ అసోసియేషన్ (గోప) జిల్లా అధ్యక్షుడు దుర్గపు రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు దుర్గపు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా గోప జిల్లా శాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోప జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, ఉపాధ్యక్షుడు దుర్గపు శ్రీనివాస్ గౌడ్, కార్యనిర్వాహఖ కార్యదర్శి, సలహాదారులు కాసారపు లక్ష్మీనారాయణ, మల్యాల మండల గోప అధ్యక్షుడు కరబూజ నర్సయ్య పాల్గొన్నారు.

● బహుజన పోరాట యోదుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314 వర్ధంతిని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని ఏటీఎం హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గౌడ సంఘం నాయకులు రవీందర్ గౌడ్, దుర్గపు శ్రీనివాస్, తిరుపతి, గంగాధర్, భాస్కర్ పాల్గొన్నారు.

కథలాపూర్: అగ్రవర్ణ ఆధిపత్యాన్ని ఎదురించి తొలి బహుజన రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, మండల గీత కార్మిక సంఘ అధ్యక్షుడు బొంగు నడిపి సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు మంగళవారం మండల కేంద్రంలో సర్వాయిపాపన్న వర్ధంతి సందర్భంగా పాపన్న విగ్రహనికి పూలమాలలు వేసిన అనంతరం మాట్లాడారు. పాపన్న స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని కోరారు. దొప్పల జలందర్, రాజాగౌడ్, అల్లకుంట లింగంగౌడ్, సత్యనారాయణ ఉన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ గోల్కొండ కోట జయించి బహుజన సామ్రాజ్యాన్ని స్థాపించిన తెలంగాణ తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. సంఘం అధ్యక్షుడు జవ్వాజి నర్సాగౌడ్, నాయకులు కాటిపెల్లి గంగారెడ్డి, వేణు, ఆది రెడ్డి, మహిపతి రెడ్డి, కంటె విష్ణు, వేణు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయా గ్రామాలలో సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలను గౌడ సంఘ నేతలు, గ్రామస్థులు నిర్వహించారు. మండలంలోని అయిలాపూర్, యూసుఫ్‌నగర్, సంగెం గ్రామాలతో పాటు గౌడ సంఘ నాయకులు వేడుకలను నిర్వహించారు. పాపన్న చిత్ర పటాలతో పాటు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎండపల్లి: మండలంలోని గుళ్ళకోట గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన బహుజన జాతి కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షులు గొల్లపల్లి సత్యం గౌడ్, బీసగోని అంజి గౌడ్, సత్యం, పొన్నం వెంకటేష్, గుండ గంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలలో నివాళులు అర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు


కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న గౌడ సంఘ నేతలు


రాయికల్‌లో పాల్గొన్న సంఘం నాయకులు

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్


పాత మార్కెట్‌లో కూరగాయాల వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, ఏప్రిల్ 1 : సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రజప్రతినిధులు దృష్టి సారించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం గుడ్ మర్నింగ్ కోరుట్లలో భాగంగా 28వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పర్యటించారు. వార్డులో ఉన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న పాత మార్కెట్‌ను సందర్శించి కూరగాయల విక్రయదారులతో మాట్లాడి వారి వ్యాపారాల విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న కొందరు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. వార్డులో ఉన్న సమస్యలను వెంట వెంటనే పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, వార్డు కౌన్సిలర్ సజ్జులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మల్యాల, ఏప్రిల్ 2: మల్యాల కొత్తపేటలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మతల్లి ఆలయంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం కాగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవ ప్రత్యేక పూజలను మందమర్రికి చెందిన ముస్త్యాల సంతోష్‌శర్మ, గ్రామ పురోహితులు కొత్తపల్లి ఉమామహేశ్వర్‌శర్మ, ప్రణీత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్యాక్రమాల్లో ఆలయ నిర్వహకులతో పాటు పోచమ్మ దీక్షపరులు, గ్రామస్థులు పాల్గొన్నారు

పంటల పోషక యాజమాన్యంపై దృష్టి సారించాలి

మల్యాల, ఏప్రిల్ 2: వేసవిలో పంటల పోషక యాజమాన్యంపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ప్రతి రైతు నేల పోషక యాజమాన్యం కింద సరైన మోతాదులో అడుగు మందులు భాస్వరం, పోటాష్‌లతో పాటు నత్రజని, పొటాషియంలను వాడాలని సూచించారు. మల్యాల రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. నేల ఆరోగ్యం కాపాడుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులు అయిన జనుము, జీలుగా సాగు చేయాలన్నారు. వాన పాములతో తయారు చేసిన ఎరువులను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వాణి, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఏవో చంద్రదీపక్ పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరికలు

ఎండపల్లి, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలకు ఆకర్శితులై పార్టీలోకి చేరుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం రోజున మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జీవన్‌రెడ్డి మహేందర్‌రెడ్డికి, ఆయన అనుచరులకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, ఏప్రిల్ 2 : మండల కేంద్రానికి చెందిన వొడ్నాల ధర్మయ్య, మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కొలకాని అక్షయ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహిపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం


స్తంభానికి ఢీ కొన్న బొలేరో వాహనం

కోరుట్ల, ఏప్రిల్ 2 : పట్టణంలోని జాతీయ రహదారిని అనుకొని ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఓ ట్రావెలర్ వాహనం అదుపు తప్పి మంగళవారం ఢీకొట్టింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. ఉదయం 4 గంటల సమయంలో బొలేరో వాహనం నిజామాబాద్ నుంచి వరంగల్ పట్టణానికి పండ్ల లోడుతో వెళ్తోంది. కొత్త బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయిన వాహన డ్రైవర్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి వాహనంపై పడిపోయింది. అప్పటికే విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలం చేరుకుని పరిశీలించారు. మెట్‌పల్లి డీఈఈ తిరుపతి, ఏడీ ఈ అంజనేయరావు ఏఈలు శ్యాంలు వెంటనే మరమ్మతులు చేయించి విద్యుత్ పునరుద్ధరణ చేశారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులపై ప్రభుత్వాల చిన్నచూపు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2: భవన నిర్మాణా కార్మికులను చూపుచూడడంతోపాటు కార్మికులకు నష్టం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నా యని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు అన్నారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూ నగర్‌లోని అర్‌ఎంపీ, పీఎంపీ భవనంలో మంగళవారం సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజమౌళి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వేల నిర్మాణాలు జరుగుతున్నప్పటికి ప్రభుత్వానికి సెస్ పేరిట కట్టాల్సిన పన్ను వసూలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్మికులు జరుగబోయే పార్ల మెంట్ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రచారాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులకు అడ్డాలలో షెడ్‌లను నిర్మించా లని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు గురజాల శ్రీధర్, కేస బిక్షపతి, రాపెల్లి రమేష్, గుంటుక నరేందర్, రాజు, ఎల్లయ్య, కోల శ్రీనివాస్, మల్లేశం, సీఐటీయూ నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

నేలల పరిరక్షణకు యాజమాన్య పద్ధతులు అవలంబించాలి

గొల్లపల్లి, ఏప్రిల్ 2 : పంటల సాగులో రసాయనిక ఏరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం వంటి యజమాన్య పద్ధతులు అవలంబించి నేలలను పరిరక్షించుకోవాలని నేల ఆరోగ్య యజమాన్య సంస్థ భూసార పరీక్షల ఆధారిత పరిశోధన విభాగం (రాజేంధ్ర నగర్) ప్రధాన శాస్త్రవేత్త డా. మాధవి పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లి రైతువేదికలో రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా రైతులు, అధికారులతో వీసీ సమావేశంను నిర్వహించారు. సమగ్ర పోషక యజమాన్యం గూర్చి, పచ్చరొట్ట ఎరువులు, వర్మి కంపోస్ట్, పశువుల పేడ లాంటి ఎరువుల వాడకం గూర్చి రైతులకు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకంను సాధ్యమైనంత మేర తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని, తద్వారా భూసారం పెరగడంతో పాటు అధి క దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. భూసారంను పెంపోందించడానికి రైతులు సమగ్ర యజజమాన్య పద్ధతులు అవలంబించాలని సూచించారు. పచ్చరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్ట్ వంటి యజమాన్య పద్ధతులు అవలంబించేలా రైతులను చైతన్య పర్చాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రాంచంద్రం, ఏవో బొట్ల కరుణ, ఏఈవో గంగాధర్ నాయక్, అశ్విని, వంశీ, ఆలేఖ్య, శ్రీహరి, రైతులు బుచ్చిరెడ్డి, అనంతరెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుదీక్షకు తరలిన కిసాన్ మోర్చా నాయకులు


దీక్షలో మద్దతు తెలుపుతున్న కిసాన్ మోర్చా నాయకులు

కథలాపూర్, ఏప్రిల్ 2 : కరీంనగర్‌లో మంగళవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన రైతు దీక్షకు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ కిసాన్ మోర్చా కన్వీనర్ పిడుగు ఆనంద్‌రెడ్డి తరలివెళ్లి మద్దతు తెలిపారు. ఈ సీజన్‌లో రైతు పండించిన పంటకు బోనస్ రు. 500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, ఎండిన పంటలకు వెంటనే నష్టపరిహారం అందించాని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలు అమలు చేయాలనే డిమాండ్లతో దీక్ష నిర్వహించినట్లు చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కథలాపూర్, ఏప్రిల్ 2 : మండలంలోని బొమ్మెనలో మంగళవారం సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం నరహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రైతులు మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకే ధాన్యం విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ రాజు, వీవోఏలు వనజ, శ్రీకాంత్, వీవో అధ్యక్షురాలు, రైతులు ఉన్నారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

మేడిపల్లి, ఏప్రిల్ 2: కల్వకోట గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. మజీద్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విందులో ముస్లింలతో కలిసి విందులో పాల్గొన్నారు. మజీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ వాజీద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జలందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 2 : అక్రమంగా మద్యం నిలువ చేసిన, విక్రయాలు జరిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి అన్నారు. మంగళవారం మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన మెంగే సాగర్ అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్న సమాచారం మేరకు సిబ్బంది దాడులు నిర్వహించి 18 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ. 8 వేల వరకు ఉంటుందని తెలిపారు. మెంగే సాగర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రత్యేక పాలనలో పడకేసిన పారిశుధ్యం

కంపుకొడుతున్నా కరువైన పర్యవేక్షణ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2: ప్రత్యేక పాలనతో పల్లెలు పరిశుభ్రంగా ఉంటాయనుకుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీలలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ సక్రమమైన పాలనను అందించాలనే ఉద్దేశ్యంతో ఉన్నతధికారులను ప్రభుత్వం నియమిస్తే వారు అడపాదడపా పల్లెలను సందర్శించడంతో పల్లెలో పారిశుధ్యం పడకేసిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిదీప్తి ఇండెన్ గ్యాస్ కార్యలయం వద్ద మురికి కాలువ నిండిపోయి కంపుకొడుతున్నా పాలనాధికా రులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ ఉన్న డ్రైనేజి పూర్తిగా నిండి పోవడంతో దోమల బెడదతో పాటు విపరీతంగా కంపుకొడుతోందని కార్యాలయం వద్ద ఒక్క నిమిషం నిలబడాలంటేనే ఇబ్బందిగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు. ఇబ్రహీంపట్నం మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా జడ్పీసీఈవో రఘువరన్ బాధ్యతలు నిర్వహిస్తున్న చోటే ఈ విధంగా ఉంటే మరి పల్లెలో పాలన ఏ విధంగా ఉం టుందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నిండిపోయిన డ్రైనేజీ కాలువ